పర్యావరణాన్ని పరిరక్షించాలనుకుంటే అందులో పీహెచ్‌డీలు చేయాల్సిన అవసరం లేదు. శాస్త్రవేత్తలూ కానక్కర్లేదు. దాన్ని ప్రేమిస్తే చాలు... దాన్ని కాపాడుకోవాలన్న తపన ఉంటే చాలు. అవే యోగనాథన్‌ను గత 25 ఏళ్లలో లక్ష మొక్కలు నాటేలా, నాటించేలా చేశాయి.



# రక్షకుడు

కోయంబత్తూరులో ఓ స్కూల్లో చిన్నారులు శ్రద్ధగా కూర్చుని, ఆయన చెప్పే విషయాలను శ్రద్ధగా వింటున్నారు.

'మీరంతా చాలామంచి పిల్లలు. బాగా చదువుకుంటున్నారు. అలాగే నాకోసం మీకోసం మనందరికోసం మరో మంచిపని చేస్తారా' అన్నారాయన.

'ఓ... చేస్తాం. చెప్పండి' అన్నారు వాళ్లంతా.

'మీ పుట్టినరోజు నాడు ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటండి'

'ఓస్ ఇంతేనా... తప్పకుండా చేస్తాం' అని మాటిచ్చారు వాళ్లంతా.

'ఇవిగో మీకోసం... ఔషధ మొక్కలు' అని వాళ్లకు ఇచ్చారాయన. పిల్లలంతా వాటిని తీసుకుని స్కూల్లో నాటారు. అలా అక్కడో ఔషధ వనం తయారైంది. అలాంటి వనాలు కొన్ని వందలు తయారుచేశారాయన.

లక్షకుపైగా మొక్కలు నాటించారు.

ఆయన పేరు మరిముత్తు యోగనాథన్.

వృత్తి కండక్టర్. ప్రవృత్తి పర్యావరణ పరిరక్షణ. ఓ కండక్టర్ ఇలా ఎందుకు మారాడు?

### *25 ఏళ్ల కిందట...*

యోగనాథన్ వాళ్లది కోయంబత్తూరు. ఆయనకు చిన్నప్పట్నుంచీ మొక్కలంటే చాలా ఇష్టం. 1980ల్లో ఓసారి ఆయన తన సోదరిని చూడటానికి నీలగిరి ప్రాంతంలోని కోటగిరి అడవులకు వెళ్లారు. అందమైన ఆ అటవీ ప్రాంతాన్ని విడిచిపెట్టి రాబుద్ధికాలేదాయనకు. అక్కడ అడవుల్లో పర్యటిస్తున్నప్పుడు ఆయనకు ఆదివాసీలూ గ్రామీణులూ వంటచెరకుకోసం చెట్లు కొట్టడం కనిపించింది. మరోపక్క, కలపను అక్రమంగా తరలించే లారీలనూ చూశారాయన. చూస్తూండగానే పచ్చగా ఉన్న ప్రాంతం బోసిపోయింది.

"అప్పుడు చాలా బాధ కలిగింది. ఇలా చెట్లన్నీ కొట్టేస్తే ఈ అందమంతా ఏమయిపోతుంది? అందుకే వాళ్లను ఆపాలనుకున్నాను. స్థానికంగా ఉండే విద్యావంతులైన యువకుల్ని చేరదీశాను. మేమంతా ఇంటింటికీ వెళ్లి చెట్లు కొట్టొద్దని చెప్పేవాళ్లం. ఆ తరవాత నాటకాలు వేయడం ప్రారంభించాం. ఎండిపడిపోయిన వాటినే వంటచెరకుగా వాడుకోండని చెబితే గిరిజనులు అర్థం చేసుకున్నారు. కలపను అక్రమంగా రవాణా చేసేవాళ్లు మాత్రం మానలేదు. దాంతో వాళ్ల లారీలకు అడ్డంగా రోడ్డుపై పడుకునేవాళ్లం. అలా నీలగిరి ప్రాంతంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం' అని పర్యావరణ ఉద్యమం మొదలుపెట్టిన రోజుల్ని గుర్తుచేసుకుంటారు యోగనాథన్.

అప్పట్లో గ్రామీణ ప్రజలకు పర్యావరణ పరిరక్షణ గురించి సులభంగా చెప్పేందుకు వీడియో మాధ్యమాన్ని ఆశ్రయించారాయన. కొందరు ఫొటోగ్రాఫర్లతో ప్రత్యేకంగా వీడియోలు తీయించారు. అంతేకాదు, పత్రికల్లో వచ్చే వార్తలనూ సేకరించి స్లైడ్లుగా తెరపై వేసి చూపించేవారు. ఆయన వీడియోల్లో మొక్కలుంటాయి, పూలుంటాయి, జంతువులుంటాయి. ఆ వీడియోలు చూస్తే అవే మనతో మాట్లాడుతున్నట్టుంటుంది.

అలా మొదలైన ఆ ఉద్యమం తరవాత్తరవాత ప్రణాళికాబద్ధంగా, మరింత ప్రభావవంతంగా మారింది. కొన్నాళ్లకు ఆయనకు తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కండక్టర్ ఉద్యోగం వచ్చింది. ఆ తరవాత ఆయన ఉద్యమం రాష్ట్రమంతా విస్తరించింది.

### *అతడే ఒక సైన్యం*

బస్సుల్లో తిరిగేటప్పుడు ప్రయాణికులకు పర్యావరణ పరిరక్షణ గురించీ మొక్కలు నాటడం గురించీ చెబుతుంటారు యోగనాథన్. సెలవురోజుల్లోనూ ఆయన వీడియోలూ స్లైడ్లతో స్కూళ్లూ కాలేజీలకు వెళ్తుంటారు. వాటిని చూపించి, విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతుంటారు. అలా ఆయన సృష్టించిన నినాదమే... 'పుట్టినరోజు నాడు ప్రతి విద్యార్థీ నాటాలి ఒక మొక్క'.

ఇప్పటివరకూ ఆయన సేలం, ఇరోడ్, నమక్కళ్, పుదుక్కోట్టై, తిరుచ్చి, కన్యాకుమారి, ధర్మపురి, చెన్నైలలో పర్యటించారు. ముఖ్యంగా పుదుక్కోట్టై, తిరుచ్చిలలోని దాదాపుగా అన్ని స్కూళ్లూ కాలేజీల్లో చిన్నారులను కలిశారు. తిరునల్వేలి జిల్లాలో 400 స్కూళ్లల్లో హెర్బల్ గార్డెన్లు పెంచేలా ప్రోత్సహించారు.



యోగనాథన్‌కు పర్యావరణ మిత్ర అవార్డు బహూకరించి షూ తొడుగుతున్న నటుడు జాన్ అబ్రహాం

'చిన్నారులకు ఫలానాది చేయొద్దు అని చెబితే వాళ్లు అంత త్వరగా దాన్ని ఆచరించరు. దీని బదులు ఇలా చేయండి అని ఓ ప్రత్యామ్నాయం చూపిస్తే త్వరగా దానికి అలవాటు పడతారు. భవిష్యత్తంతా విద్యార్థులదే. వాళ్లను ఆలోచింపజేయగలిగితే చాలు... మిగతాది వాళ్లే చూసుకుంటారు. అందుకే నేను వాళ్లనే ఎక్కువ కలుస్తుంటాను' అంటారు ఈ పర్యావరణ ప్రేమికుడు.

### *ఇంకా చాలా...*

యోగనాథన్ ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా కూడా ప్రచారం చేస్తుంటారు. చిన్నారులను అటవీ ప్రాంతాలకు పర్యటనలకు తీసుకెళ్తుంటారు. వైద్యసంబంధ వ్యర్థాలను తగ్గించుకునే విషయంపై వైద్యులకు సెమినార్లు నిర్వహిస్తుంటారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకూ పర్యావరణ అవగాహనా కార్యక్రమాలు చేపడుతుంటారు.

తమిళనాడులో అడవుల నరికివేతకు పాల్పడిన వాళ్లపై ఆయన అటవీశాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. వాళ్లు పట్టించుకోకపోవడంతో ఆయనే వాళ్లపై కేసులు పెట్టారు. అలా ఏడు కేసుల్లో ఆయన నెగ్గారు. అడవులనూ కాపాడారు.

పర్యావరణ పరిరక్షణ గురించి ఆయనో లఘుచిత్రాన్ని కూడా తీశారు. 'ఇందుకోసం మా స్టాఫ్ ఫెడరేషన్ వాళ్లు నాకు రూ.60 వేలు ఇచ్చారు' అని చెబుతారాయన. అంతే కాదు... యోగనాథన్ రైతుపక్షపాతికూడా. పారిశ్రామిక వ్యర్థాలను పంటపొలాల్లోకి విడిచిపెట్టేవాళ్లపైనా ఆయన పోరాటాలు చేశారు. ఆయన కృషిని గుర్తించి కేంద్రప్రభుత్వం, తమిళనాడు రాష్ట్రప్రభుత్వం సహా ఎన్నో జాతీయ అంతర్జాతీయ సంస్థలు అవార్డులతో సత్కరించాయి. 'తమిళనాడులోని అన్ని స్కూళ్లూ కాలేజీలకూ నేను వెళ్లాలన్నది నాముందున్న లక్ష్యం' అంటారు యోగనాథన్. ★